

## అందని బోనస్..

ములుగు జిల్లాలో అత్యధికంగా 60 వేల ఎకరాల్లో వరి పంట వేయగా, ఇందులో ఎక్కువగా సన్నరకం సాగయ్యింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ డబ్బులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమకావడం లేదు. ధాన్యం విక్రయ సమయంలో రైస్ మిల్లర్లు క్వింటాకు 3 నుంచి 5 కిలోల వరకు కోత పెట్టినా అమ్ముకున్నారు. వీటి డబ్బులు బోనస్ రూపంలో వస్తాయని ఆశపడితే చివరకు నిరాశే ఎదురైంది. కొనుగోళ్లు పూర్తయి రెండు నెలలైనా బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 166 కొనుగోలు కేంద్రాల ద్వారా 6,94,260 క్వింటాళ్ల సన్నవడ్లను అధికారులు కొనుగోలు చేశారు. బోనస్ కింద రైతులకు రూ. 34.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 24.78 కోట్లు మాత్రమే ఖాతాల్లో జమచేశారు. ఇంకా రూ. 9.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటికోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.



నకిలీ పురుగు మందుల విక్రయాలకు పాల్పడిన ముఠా అరెస్ట్‌ను చూపిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

*ములుగు జిల్లాలో రైతుల అవస్థలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇక్కడ సాగు నీటి కష్టాలు, విద్యుత్ ఇబ్బందులు లేనప్పటికీ పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాక అన్నదాతలు గోసపడుతున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగు సమయానికి ఖాతాలో జమైన రైతుబంధు.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. కష్టాలకోర్చి పంట పండిస్తే సరైన దిగుబడి రాక.. వచ్చినా మార్కెట్‌లో సరైన ధర లేక ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వరి, మిర్చి, మక్కజొన్న, పత్తి సాగుచేస్తున్న ఒక్కో రైతుది ఒక్కో దీనగాథ. సన్న రకం ధాన్యానికి బోనస్ బోగస్‌గా మారగా, మిర్చికి ధర లేక, మక్కజొన్న పంట నష్టం తేలక దిగాలు చెందుతున్నారు. తాము ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.*

*- ములుగు, మార్చి 5 (నమస్తే తెలంగాణ)*



కల్లంలో ఆరబోసిన మిర్చి పంట



కల్లంలో మిర్చి ఏరుతున్న కూలీలు

# వరికి బోనస్ బోగస్
# మిర్చి ధర ఢమాల్

- సన్నవడ్లు విక్రయించి రెండు నెలలైనా అందని బోనస్
- దిగుబడి లేక.. మార్కెట్‌లో గిట్టుబాటు కాక మిరప రైతు దిగాలు
- నకిలీ విత్తనాలతో భారీగా మక్కజొన్న పంట నష్టం
- ఇంకా లెక్క తేలక లబోదిబోమంటున్న అన్నదాతలు
- ఇదీ ములుగు జిల్లా రైతుల వింత పరిస్థితి

## మక్కజొన్న రైతుకు నకిలీ బెడద

ములుగు జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు 25,320 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ప్రస్తుతం కోత దశకు చేరుకోగా, నల్లి వైరస్ సోకి మిర్చి పంట ఎండిపోతున్నది. దీంతో ఎకరానికి 18 నుంచి 25 క్వింటాళ్లు వచ్చే దిగుబడి 10 నుంచి 15 క్వింటాళ్లు మించడం లేదు. మార్కెట్‌లో సైతం ధర లేకపోవడంతో పెట్టుబడి వచ్చే అవకాశం కూడా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రకాన్ని బట్టి మిర్చి క్వింటాకు రూ. 12 వేల ధర పలుకుతున్నది. దీంతో రైతులు ఎకరాకు రూ. లక్ష వరకు నష్టపోతున్నామంటూ వాపోతున్నారు. ములుగు జిల్లాలో మిర్చి మార్కెట్ లేకపోవడంతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కొందరు రైతులు అడిగిన ధరకు మిర్చిని అమ్మలేక కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపర్చుకొని వస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం. వారు ఒక ఎకరానికి రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు అదనపు భారం మోయాల్సి వస్తున్నది. మిర్చికి రూ.16 వేల నుంచి రూ. 20 వేల వరకు మద్దతు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### లెక్క తేలని మక్క పంట నష్టం

ములుగు జిల్లాలో వరి, మిర్చి తర్వాత అత్యధికంగా రైతులు మక్కజొన్న సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పలు కంపెనీలకు చెందిన విత్తనాలు విత్తినప్పటికీ ఈ సీజన్‌లో వాజేడు, కన్నాయిగూడెం, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో పంట దిగుబడి రాక రైతులు నష్టపోయారు. ప్రజా సంఘాల నాయకులు, రైతుల పోరాటాలతో జిల్లా యంత్రాంగం స్పందించి వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 414 మంది రైతులు 838 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించినప్పటికీ దీనిపై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు.



### గతం కంటే దిగుబడి తగ్గింది

గతం కంటే మిర్చి దిగుబడి ఇప్పుడు తగ్గింది. ధర కూడా లేదు. గత ఏడాది రూ.23 వేలు ఉన్న ధర ప్రస్తుతం రూ.14 వేల నుంచి రూ. 15 వేలు మాత్రమే పలుకుతున్నది. దీంతో పంట సాగు చేసిన రైతులమంతా నష్టపోతున్నాం.

*– కాకర్లపూడి వినోద్, మిర్చి రైతు, జంగాలపల్లి, వాజేడు మండలం*





### ఎకరానికి రూ. 1.50 లక్షల ఖర్చు..

నేను నాలుగు ఎకరాల్లో మక్కజొన్న పంట సాగు చేసిన. నకిలీ విత్తనాల కారణంగా పంట చేతికి రాకుండా పోయింది. ఉత్త బెండు మాత్రమే మిగిలింది. మక్కజొన్న పంట సాగు చేయాలంటే ఎకరానికి రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు ఖర్చవుతున్నది. మక్కజొన్న రైతు కష్టాలు ఎవరికి చెప్పుకోవాలి. నాతో పాటు చాలా మంది రైతులు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

*– పాయం రాంబాబు, మక్కజొన్న రైతు, యోగితనగర్, వెంకటాపురం (నూగూరు)*



### తెగుళ్లతో దిగుబడి తగ్గింది

ఈసారి మిర్చి పంటకు తెగుళ్లు సోకి దిగుబడి బాగా తగ్గింది. గతంలో పండు మిర్చి ధర రూ. 45 ఉండగా ఇప్పుడు రూ. 25 పలుకుతున్నది. మిర్చి ఆరబెట్టిన సమయంలో కూలీల ఖర్చు కూడా ఎక్కువవుతున్నది. దీంతో చేసేదేమీ లేక పండు మిర్చిని అమ్ముతున్నా. ఈ సారి మిర్చి రైతులు భారీగా నష్టపోయినట్లే.

*– సలాది రత్నంరాజు, మిర్చి రైతు, వాజేడు*



### ఖర్చులు పెరిగినయ్.. ధర తగ్గింది

మిర్చి పంట పండించిన రైతుల పరిస్థితి ఆగంగా మారింది. గత ఏడాది కంటే సాగు ఖర్చులు పెరుగగా ఇప్పుడు ధర కూడా తగ్గిపోయింది. 3 ఫేజ్ విద్యుత్ సక్రమంగా రావడం లేదు. కోతలు ఉన్నాయి. పంటకు తెగుళ్లు సోకి దెబ్బతిన్నది. మా గోస ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. పంట పండించుడే పాపమైంది.

*– మోడెం ప్రకాశ్, మిర్చి రైతు, ఇప్పగూడెం, వాజేడు మండలం*

## బ్రాండెడ్ పేరుతో నకిలీ పురుగు మందులు

- విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్
- రూ. 34 లక్షల మందులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సుబేదారి, మార్చి5: ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ పురుగు మందులు విక్రయించి మోసాలకు పాల్పడిన ఐదుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్‌ఝా నిందితుల వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం వరంగల్ నగరంలోని గోపాలస్వామి గుడి ప్రాంతంలో మట్టెవాడ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా కారులో వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కురుగోడుకు చెందిన కాట్రగౌడ భాస్కర్‌రెడ్డిని అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. భాస్కర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ చర్లపల్లిలో ప్రముఖ కంపెనీలు బేయర్, టాటా, కోర్టెవా మరో నాలుగు కంపెనీల పేరుతో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గోడౌన్‌పై దాడులు చేశారు. హైదరాబాద్‌కు చెందిన నాగవెంకటరంగారావు, ముద్దంగుల ఆదిత్య, పిట్ట నవీన్, మిర్యాలగూడకు చెందిన దూదిమెట్ల శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ పురుగు మందులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు వారు అంగీకరించారు. నిందితుల నుంచి రూ. 34 లక్షలు విలువ చేసే నకిలీ పురుగు మందులు, రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ లేబుళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు గోపి, సార్ల రాజు, సిబ్బందిని సీపీ అభినందించారు.

### రైతులను మోసం చేస్తున్న వ్యాపారి అరెస్టు

పెద్దవంగర : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాల గ్రామ శివారులో నకిలీ పురుగు మందులను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. ఏవో స్వామి, ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంచలి శ్రీను దంతాలపల్లి మండలం రేపోణి గ్రామానికి చెందిన పొన్నాల శ్యాంసుందర్‌రెడ్డి, తొర్రూరుకు చెందిన సైదులు సహకారంతో నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. శ్రీనును అదుపులోకి తీసుకొని, పురుగు మందులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులకు నోటీసులు

కరీమాబాద్, మార్చి 5: వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఇటీవల పలువురు రైతులు కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయా రైతులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. భూమి ఇవ్వమనడానికి గల కారణాలను తెలపాలని నోటీసులో పేర్కొన్నారు. దీంతో రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిసింది.

4వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
HMT
మా ప్రియమైన డీలర్లకు, కస్టమర్లకు, బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులందరికి 4వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా వద్ద : JSW, TATA, JINDAL, Colour Shine AM/NS కంపెనీల అన్నిరకముల రేకులు సరసమైన ధరలకు లభించును.
MS పైపులు & GP పైపులు, Angles, Flat పట్టీలు, Sq. రాడ్స్, C చానెల్స్, I-బీమ్స్, చైన్-లింక్ జాలీలు, ముళ్ళ తీగలు, CR Sheets, GI Sheets, HR Sheets, షెడ్డు యాక్సరీస్ లభించును.
HINDUSTAN MANUFACTURERS & TRADERS
Plot No. 129&130, Industrial Estate, Rampur, Warangal.
Prop: Rajesh Reddy Karivendula Ex. Indian Navy
Supplier Manufactures Roofing Sheets & Accessories
Cell: 9869823945

సింగిల్‌పట్టీ మిర్చి@41వేలు

## సింగిల్‌పట్టీ మిర్చి@41వేలు

కాశీబుగ్గ, మార్చి 5 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సింగిల్ పట్టీ మిర్చి క్వింటాల్‌కు రూ.41వేలు పలికింది. గతేడాది ఈ రకానికి అత్యధికంగా రూ.40వేలు, మధ్యరకం రూ.35వేలు, కనిష్ఠంగా రూ.25వేలు పలికాయి. మార్కెట్‌కు ఇప్పటివరకు సుమారు 4లక్షల 30వేల క్వింటాళ్ల మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అందులో సింగిల్‌పట్టి మిర్చి 32 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు.

## ఆర్టీవోలో విజిలెన్స్ తనిఖీలు

- పత్రాలు పరిశీలించిన అధికారులు
- భయంతో మూసేసిన ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణాలు

కరీమాబాద్, మార్చి 5 : వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ మల్లయ్య ఆధ్వర్యంలో అధికారులు రంగశాయిపేటలోని కార్యాలయానికి చేరుకొని పలు పత్రాలు పరిశీలించడంతో పాటు కంప్యూటర్లను తనిఖీ చేశారు. సిబ్బందిని ప్రశ్నించారు. రవాణా శాఖ కార్యాలయం సమీపంలోని ప్రైవేట్ వ్యక్తుల కార్యాలయాలు, దుకాణాలను సైతం తనిఖీ చేశారు. అయితే తనిఖీ విషయం తెలియడంతో అప్పటికే వీటిని మూసివేశారు. కార్యాలయంలో జరుగుతున్న బ్రోకర్ల దందాపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు దాడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కార్యాలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి.



మూసి ఉన్న ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణాలు

## మొదటి రోజు ప్రశాంతం

### ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష జరగనుండగా, విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోగా వారిని తనిఖీ చేసిన అనంతరం లోపలికి పంపించారు. సెంటర్లను కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు సందర్శించారు. కాగా, మడికొండ, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, నెక్కొండ, మహబూబాబాద్‌లో ఒక సెంటర్‌కు బదులు మరో సెంటర్‌కు వచ్చిన విద్యార్థులను పోలీసులు తమ వాహనాల్లో కేంద్రాలకు తరలించారు.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 5



మడికొండ నుంచి కాజీపేట సెంటర్‌కు విద్యార్థిని బైక్‌పై తీసుకెళ్తున్న కానిస్టేబుల్



వరంగల్‌లోని ఏవీవీ కళాశాల వద్ద క్యూలో ఉన్న విద్యార్థులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
ప్రవేశం ఉచితం
Present
AUTO SHOW
అన్ని రకాల వాహనాల ప్రదర్శన మరియు అమ్మకం
ప్రతి రోజూ బుకింగ్స్‌పై లక్కీడ్రా ద్వారా బహుమతులు*
VENUE :
HAYAGRIVACHARI GROUND
BALASAMUDRAM - HANUMAKONDA
MARCH 08 09 2025
Digital Partner
TV Partner
* షరతులు వర్తిస్తాయి
Main Sponsor
MARUTI SUZUKI ARENA
ADARSHA AUTOMOTIVES PVT.LTD.
TVS
ATHER
★ KARIMNAGAR ★ WARANGAL ★ ADILABAD ★ HYDERABAD
In Association with
Audi Hyderabad
SKODA
MAHAVIR GROUP
NEXA
ADARSHA AUTO WORLD PVT.LTD. WARANGAL
Green Honda
RAAM GROUP
MG 100 YEARS OF DRIVING SMILES
MALIK GROUP OF COMPANIES
KIA
YAMAHA
HAPPY AUTOMOTIVES PVT.LTD., Mulugu 'X' Road, Warangal.
WINGS
BHAVYA EV MOTORS
Chetak
WARANGAL
For Stall Booking Contact: Warangal: 9182777299 / 9182777552